సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం। 22। మే। 2023



పెన్నాలో గల్లంతై వ్యక్తి మృతి

కోవూరు మండలంలోని పడుగుపాడు ఎస్సీ కాలనీ చెందిన ఓ వ్యక్తి పెన్నా నదిలో చేపల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు జారి పడి మృతిచెందాడు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,180
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,584
3 శాతం జీఎస్టీతో	రూ.5,751
నవర (8 గ్రా)	రూ.46,008

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.7 /27.7

జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఉష్ణోగ్రతలు కొంతమేర తగ్గాయి. గాలిలో 66 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

వేట విరామం వేళ.. వైవిధ్య జీవనమాల

కడలిలో చేపల వేట చేసే గంగపుత్రులకు వేట విరామ సమయం చాలా విభిన్నంగా గడుస్తుంది. పదినెలలపాటు వేటలో జీవితం ఒక రకంగా సాగుతుంది. వేసవి కాలంలో మత్స్య సంపద పునరుత్పత్తిలో భాగంలో రెండు నెలలపాటు వేటను నిషేధిస్తారు. దీంతో చాలా మంది ఇంటిపట్టునే ఉంటూ బోట్లు, వలల రిపేర్లపై దృష్టి పెడుతుంటారు. సంక్షేమ పథకాలు, విరామ సమయంలో చేసే ఆర్థిక సాయం వారికి ఎంతగానో ఉపయోగపడుతోంది. కొందరు వివిధ పనులకు వెళ్తుంటారు.

- రెండు నెలలు గ్రామ వీధుల్లో మత్స్యకారుల సందడి
- చెట్ల నీడన కాలక్షేపం
- ప్రతి ఏటా మత్స్యకార కుటుంబాలకు అండగా ప్రభుత్వం
- ఇటీవల బ్యాంక్ ఖాతాల్లో ఆర్థిక సాయం జమ
- కొందరు వ్యవసాయం, ఉపాధి పనులపై మరికొందరి మక్కువ



సముద్రంలో వేట చేస్తున్న మత్స్యకారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 169 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. సుమారు 1.50 లక్షల మంది మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. అందులో దాదాపు 41 వేల మందికి చేపల వేటే ఆధారం. ప్రతి ఏటా 65 వేల టన్నుల మత్స్య సంపదను సముద్రం నుంచి సేకరిస్తారని గణాంకాలు చెబుతున్నాయి. గంగపుత్రుల జీవనశైలి విభిన్నంగా ఉంటుంది. వేట జరిగే రోజుల్లో అయితే వేకువజామునే దినచర్య ప్రారంభమవుతుంది. సిద్ధం చేసుకున్న వలలను భుజాలపై వేసుకుని బోటులో సముద్రంలోకి వెళ్తారు. సుమారు ఐదు కిలోమీటర్లు వెళ్లి వలలు వేసి మత్స్య సంపదను సేకరించి ఉదయం 8 గంటలకే ఇంటికి చేరుకుంటారు. మత్స్య సంపదను వేలం ద్వారా విక్రయాలు చేసుకుంటారు. మెకనైజ్డ్ బోట్లు ఉన్న వారు మాత్రం వారంరోజుల పాటు వేట చేస్తారు. ఇలా పదినెలలపాటు జరుగుతుంది.

ఈ సమయంలో..

ప్రతి ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 15వ తేదీ వరకు సముద్రంలో చేపల వేట నిషేధం అమలులో ఉంటుంది. ఈ విరామ సమయంలో మత్స్యకార కుటుంబాల జీవనం కొంత విభిన్నంగా ఉంటుంది. కొందరు స్థానికంగా ఆక్వాకల్చర్‌లో కూలీలుగా, రొయ్యల ప్యాకింగ్, చెరువుల్లో రొయ్యలు పట్టడం, ఇతరత్రా పనులకు వెళ్తారు. ఇంకొందరు ఇంటి వద్దే ఉంటారు. పలువురు మహిళలు ఉపాధి హామీ పనులకు వెళ్తుంటారు. ఒక వేళ పనులు అందుబాటులో లేకుంటే వారు కూడా ఇంటిపట్టునే ఉంటారు. అందరిలో దైవభక్తి కూడా ఎక్కువే. స్థానికంగా ఉండే ఆలయాల్లో ప్రతి ఏటా ఘనంగా ఉత్సవాలు చేస్తుంటారు.

ప్రత్యామ్నాయంగా..

మత్స్యకార పల్లెల్లో చేపల వేటతోపాటు ప్రత్యామ్నాయంగా వ్యవసాయం చేస్తున్న వారు కూడా ఉన్నారు. చదువుకున్న యువత ఉపాధి మార్గాల వైపు దృష్టి పెట్టారు. కావలి రూరల్ మండలంలోని తుమ్మలపెంట పంచాయతీ, ఇందుకూరుపేట మండలంలోని పలు గ్రామాల్లో మత్స్యకారులు వ్యవసాయం చేసుకుంటున్నారు. వేట విరామం సమయంలో భూముల్లో వేరుశనగ పంట సాగు చేస్తున్నారు. యువత మాత్రం చదువులపైనే దృష్టి సారించి విద్యావంతులుగా మారి ఉద్యోగావకాశాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడం జరుగుతోంది. కానీ చేపల వేటను నమ్ముకున్న కొందరు వేరే ఉపాధి మార్గలపై దృష్టి సారించడం లేదు.

వైఎస్సార్ మత్స్యకార భరోసాలో భాగంగా..

జిల్లాలో లబ్ధిదారులు :	నిధులు :
12,072 మంది	రూ.12.7 కోట్లు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో.. తీరం : 169 కిలోమీటర్లు	ఎన్ని మండలాలు : 12
ఎన్ని గ్రామాలు : 98	

ప్రభుత్వ సాయంతో..

చేపల వేటకు విరామం ఇచ్చిన సమయంలో మత్స్యకారుల జీవన భృతికి ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.10,000 చొప్పున ఆర్థిక సాయం చేస్తోంది. ఈ సాయం కాస్త ఆ కుటుంబాలకు ఆధారంగా మారుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కూడా వారి మెరుగైన జీవనానికి దోహదపడుతోంది. అనేక పథకాలు పక్కాగా అందుతుండడం వేట విరామం సమయంలో ఆ కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించింది. ఈ ఏడాది జిల్లాలో 12,072 మందికి ప్రభుత్వ సాయం అందింది.



చేపల వేటకు ఉపయోగించే బోట్లు (ఫైల్)

రుణాలివ్వాలి



మాకు వ్యవసాయ భూముల్లేవు. పంటలు పండించే విధానం తెలియదు. తెలిసిందల్లా చేపల వేటే. రెండునెలల పాటు ఇళ్ల వద్దే ఉంటాం. ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తోంది. ఇంకా వలలు బోట్ల కోసం రాయితీపై రుణాలివ్వాలి.

– ఆవుల గోవింద్, తుమ్మలపెంట

సాయం చేస్తోంది



వేట విరామ సమయంలో రెండునెలలపాటు ఖాళీగా ఉంటున్నాం. ఆక్వా సాగు చేసే వారు పనులకు పిలిస్తే వెళ్తాం. అర్హత ఉన్న వారికి ప్రభుత్వం రూ.10 వేల వంతున సాయం చేస్తోంది. ఇంకా సంక్షేమ పథకాల ద్వారా వచ్చే నగదుతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం.

– కాటంగారి కనకయ్య, తుమ్మలపెంట

విద్యావంతులు అవుతున్నారు



మా గ్రామాల్లో చాలా వరకు యువకులు చదువుకుని విద్యావంతులుగా మారుతున్నారు. వారు మాత్రం చేపల వేటకు వెళ్లడం లేదు. పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పించాలి.

– కొండూరు వెంకటేశ్వర్లు, రాముడుపాళెం

అర్హులకు సంక్షేమ ఫలాలు

మత్స్యకారులకు వేట విరామంలో ప్రభుత్వ సాయం చేస్తోంది. ఈ ఏడాది జిల్లాలో 12 వేల మందికి రూ.10 వేల వంతున నగదు అందించాం. అలాగే ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా కూడా బోట్లు, వలలు, అందిస్తున్నాం. ఇంకా మెకనైజ్డ్ బోట్ల పంపిణీకి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలు రూపొందిస్తోంది.

– నాగేశ్వరరావు, ఫిషరీస్ జేడీ, నెల్లూరు

న్యూస్‌రీల్

జొన్నవాడ బ్రహ్మోత్సవాలు విజయవంతం

- చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిశాయని ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. జొన్నవాడలోని కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 10 నుంచి 21వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరిగాయన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ చర్యలు తీసుకుందన్నారు. అలాగే వైద్య సిబ్బంది, రెవెన్యూ శాఖ, పంచాయతీ అధికారులు సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మౌలిక వసతులను కల్పించామన్నారు.

రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్‌గా సుధీర్‌నాయుడు



నెల్లూరు(అర్బన్): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ వైస్ చైర్మన్‌గా దామిశెట్టి సుధీర్‌నాయుడిని కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. నెల్లూరు మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన కమిటీ సమావేశంలో సభ్యులు ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ ఫలితాల్లో గత సోమవారం పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వర్గానికి చెందిన (సేవా ప్యానెల్) 15 మంది సభ్యులు గెలుపొందారు. అదేరోజు చైర్మన్‌గా చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారిగా సురేష్‌కుమార్ జైన్‌ను ఎన్నుకున్నారు. అయితే వైస్ చైర్మన్ పదవికి దామిశెట్టి సుధీర్‌నాయుడితోపాటు, గంధం ప్రసన్నాంజనేయులు పోటీ పడటంతో దానిని ఖాళీగా ఉంచారు. ఇప్పుడు అందరూ మాట్లాడుకుని ఏకగ్రీవంగా సుధీర్‌నాయుడిని ఎన్నుకున్నారు. ఈయన రెండో దఫా సైతం వైస్ చైర్మన్ అయ్యారు. కమిటీ సభ్యులు అభినందించారు.

సోమశిలలో 44.832 టీఎంసీలు



చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 44.832 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 171 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 3,200 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 200, దక్షిణ కాలువకు 300, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో నీటి మట్టం 95.251 మీటర్లు ఉంది.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న ప్రతినిధులు

గూడూరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన బలిజ సామాజికవర్గానికి చెందిన విద్యార్థులకు ఆదివారం నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పట్టణంలోని మినీ బైపాస్‌లో ఉన్న ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం గూడూరు శాఖ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నతంగా ఎదిగేందుకు విద్య ఒక్కటే మార్గమని, చిన్నతనం నుంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించేందుకు కష్టపడి చదువుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో విద్యుత్‌శాఖ విశ్రాంత డీఈ అనిల్‌కుమార్, నాయకులు మదనమేటి వెంకటరమణయ్య, చదలవాడ హరిబాబు, శీలం కిరణ్‌కుమార్, మల్లికార్జున్, సారంగం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ



మాట్లాడుతున్న ఆర్‌ఐఓ వరప్రసాద్‌రావు, పక్కన అధికారులు

- విద్యార్థులు 29,218 మంది
- 72 పరీక్ష కేంద్రాల్లో నిర్వహణ
- సీసీ కెమెరాల ఏర్పాటు
- నిమిషం నిబంధన అమలు

నెల్లూరు(టౌన్): ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఈనెల 24 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆర్‌ఐఓ వరప్రసాద్‌రావు తెలిపారు. నెల్లూరు నగరం స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్‌ఐఓ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐఓ మాట్లాడుతూ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 72 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 29,218 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఫస్టియర్‌కు సంబంధించి జనరల్‌లో 20,651 మంది, ఒకేషనల్‌లో 776 మంది కలిపి 21,427 మంది, సెకండియర్‌లో జనరల్ 6,968, ఒకేషనల్‌లో 823 కలిపి మొత్తం 7,791 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేస్తున్నారని తెలియజేశారు. పరీక్షలను పక్కాగా నిర్వహించేందుకు నాలుగు ఫ్లయింగ్, 4 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు. కాగా విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామన్నారు. సమస్యలుంటే 0861–2320312 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని సూచించారు. కంట్రోలు రూం ఇన్‌చార్జిగా బాలసుబ్బారెడ్డిని నియమించినట్లు చెప్పారు. హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. కేంద్రాల్లోకి విద్యార్థులను పరీక్ష సమయానికి అర గంట ముందు మాత్రమే అనుమతిస్తారన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ నిబంధనను అమలు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో డీఈసీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, వేణుగోపాల్, చంటిరాజు, బాలసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు, ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

- ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు
- బహిరంగంగా మద్యం తాగేవారిపై దాడులు
- జరిమానాలు, జైలు శిక్షలు విధిస్తున్న వైనం



నెల రోజుల్లో..

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై నమోదైన కేసులు :	1,082
బహిరంగంగా మద్యం తాగే వారిపై నమోదైన కేసులు :	1,960

నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో కొందరు దాడులకు పాల్పడుతున్నారు. చిన్నపాటి వివాదాలు ఘర్షణలకు దారితీస్తున్నాయి. మద్యం మత్తులో మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కొందరు మృత్యువాత పడుతుండగా అధికశాతం మంది క్షతగాత్రులవుతున్నారు. ఇంకొందరు మద్యం తాగిన మైకంలో వాహనాలు నడుపుతూ ఇతరుల ప్రాణాలను బలి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నేరాలు, ప్రమాదాల కట్టడే లక్ష్యంగా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు, బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై దాడులు కొనసాగించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది. ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షల్లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు. ఎక్కువ మోతాదులో మద్యం తాగిన వారికి న్యాయస్థానం అపరాధరుసుముతోపాటు జైలుశిక్ష సైతం విధిస్తోంది. నెల రోజుల వ్యవధిలో 1,082 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. పదుల సంఖ్యలో మందుబాబులను జైలుకు పంపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే జైలు జీవితం తప్పదని వాహనదారులను హెచ్చరిస్తున్నారు.

కేసుల నమోదు

బహిరంగంగా మద్యం తాగడం చట్టరీత్యా నేరం. నిబంధనల ప్రకారం ప్రభుత్వం కేటాయించిన బార్లు, ఇళ్లలో మాత్రమే మద్యం తాగాలి. రోడ్ల పక్కన, గట్లపై, బస్టాండ్‌లలో, చెట్ల కింద ఇలా ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగకూడదు. గతంలో పనిచేసిన ఎస్పీలు దృష్టి సారించినప్పటికీ ఫిర్యాదు అందినప్పుడు మాత్రమే ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేసి చర్యలు తీసుకునేవారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి మాత్రం ఇందుకు భిన్నంగా బహిరంగంగా మద్యం తాగే వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. బహిరంగంగా మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో పోలీసు అధికారులు దాడులను ముమ్మరం చేశారు. నెలరోజుల వ్యవధిలో 1,960 కేసులు నమోదు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగంగా మద్యం తాగుతూ పట్టుబడుతున్న వారిలో అధికంగా యువకులే ఉండడంతో వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. పోలీసుల చర్యలతో మందుబాబులు బెంబేలెత్తుతున్నారు.

బార్లపై దాడులకు సిద్ధం

నెల్లూరు నగరంలోని కొన్ని బార్లు సమయపాలనకు నీళ్లొదిలి అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలు సాగిస్తున్నాయి. దీంతో మందుబాబులు పూటుగా మద్యం తాగి ఘర్షణలకు పాల్పడుతున్నట్లు ఎస్పీకి ఫిర్యాదులు అందాయి. దీంతో ధాబాలు, అనధికార మద్యం విక్రయాలు, సమయపాలన పాటించని బార్లు తదితరాలపై పోలీసు అధికారులు చర్యలకు రంగం సిద్ధం చేశారు. నిబంధనల ఉల్లంఘనులపై కేసులు నమోదు చేయనున్నారు. ఏది ఏమైనప్పటికీ నేరాలు, ప్రమాదాలను పూర్తిస్థాయిలో కట్టడి చేసే దిశగా పోలీసులు చర్యలు వేగవంతం చేశారు.

విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ కన్నెర్ర

- దాడులు చేసి కేసుల నమోదు
- రూ.5.37 లక్షల జరిమానా విధింపు
- విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి



విద్యుత్ చౌర్యం జరిగినట్లు అధికారులు గుర్తించిన మీటర్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ అధికారులు కన్నెర్ర చేశారు. ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్, సెక్యూరిటీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ అధికారి పర్యవేక్షణలో శనివారం అర్ధరాత్రి జిల్లాలోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. జిల్లా ఎస్ఈ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టామని విజిలెన్స్ జిల్లా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో ఉన్న తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని చిట్టమూరు మండల పరిధిలో ఆరూరు, ఈశ్వరవాక, రాఘవవారిపాళెం పరిసర ప్రాంతాల్లో రొయ్యల గుంటల వద్ద ఆకస్మిక తనిఖీలు చేశామన్నారు. యజమానులు మీటర్‌ను బైపాస్ చేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతుండడాన్ని గుర్తించినట్లు తెలిపారు. దీంతో సంబంధిత గుంటల యజమానులైన ఈగల చిరంజీవి, నాగముంత సుబ్బయ్య, మల్లి వెంకటాచలంపై కేసులు నమోదు చేసి రూ.5,37,035 నగదును జరిమానా విధించామని వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించి విద్యుత్ సంస్థకు నష్టం కలిగిస్తే సహించేది లేదన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారు ఎంతటివారైనా కేసులు నమోదు చేసి అధిక మొత్తంలో జరిమానా విధించడంతోపాటు, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో విద్యుత్‌శాఖ కోట అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వరప్రసాద్ రెడ్డి, డీపీఈ జగదీష్, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్, ఎస్సై సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల శాఖలో కొత్తకొత్తగా..

- గత వారం నుంచి అమల్లోకి ఈ–స్టాంపింగ్ విధానం
- అలాగే చిట్స్‌లో కూడా మారిన నిబంధనలు
- అంతా ఆన్‌లైన్‌లోనే..



నెల్లూరులోని రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం

నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్స్ శాఖలో కొత్త మార్పులు తెచ్చింది. ప్రజలకు సులువుగా సేవలందేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్స్ పద్ధతుల్లో పలు మార్పులు, డాక్యుమెంట్ తయారీ విధానంలో కొత్త విధానాలు తీసుకొచ్చారు. తాజాగా ఈ–స్టాంపింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. దీంతోపాటు చిట్స్ విధానం కూడా ఆన్‌లైన్‌లోకి మారింది.

ఈ–స్టాంపింగ్

అఫిడవిట్లు, అగ్రిమెంట్లు, దస్తావేజుల రిజిస్ట్రేషన్స్‌కు ఇలా పలు రకాల సేవలకు నాన్ జ్యుడిషియల్ స్టాంపులను వాడేవారు. దీని స్థానంలో స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ–స్టాంపింగ్ విధానాన్ని వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. రిజిస్ట్రేషన్స్ శాఖ ద్వారా నిర్వహించే సేవలకు అధికారికంగా వీటిని వాడుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. సమీపంలోని ఆ శాఖ కార్యాలయంలో ఈ విషయం గురించి వినియోగదారులు తెలుసుకుని వాడుకోవాలని అధికారులు చెప్పుకొస్తున్నారు.

ఆన్‌లైన్ విధానంలోనే..

చిట్స్ విధానంలో మార్పులను రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పలు చిట్స్ కంపెనీలు మోసాలకు పాల్పడుతూ వినియోగదారులకు ఇబ్బందులు గురి చేస్తున్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం కొత్త వ్యవస్థను తెచ్చింది. ఈనెల 15వ తేదీ నుంచి చిట్స్ నిర్వహణ మొత్తం ఆన్‌లైన్‌లో జరిగేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో అధికారికంగా రిజిస్ట్రేషన్ శాఖలో 21 చిట్స్ కంపెనీలు నమోదై ఉన్నాయి. వీటికి సంబంధించి 217 గ్రూపులుగా చిట్స్ వేసి ఉన్నారు. వాటి ద్వారా రూ.24.45 కోట్ల వ్యాపారాన్ని అన్ని సంస్థ నిర్వాహకులు లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు చెప్పుకొస్తున్నారు. ఇక నుంచి కొత్త చిట్స్ వేస్తే కచ్చితంగా ఆన్‌లైన్‌లోనే వివరాలు నమోదు చేసుకోవాలి. అలా చేసిన వాటికే రిజిస్ట్రేషన్స్ అధికారులు అనుమతులు ఇవ్వనున్నారు.

ఈ–స్టాంపింగ్ వాడుకుంటే మంచిది



జిల్లాలో రిజిస్ట్రేషన్లకు లేదా ఇతర దస్తావేజుల విషయంలో వాడే స్టాంపులకు సంబంధించి ఈ–స్టాంపింగ్ వాడుకోవచ్చు. దీనిపై ఇప్పటికే అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆదేశాలు ఇచ్చాం. అదే విధంగా చిట్స్ విధానంలో ఆన్‌లైన్ అమల్లోకి వచ్చింది. కొత్త చిట్స్ వేసే ప్రతి కంపెనీ ఆన్‌లైన్‌లోనే అనుమతులు తీసుకోవాలి.

– వి.కిరణ్‌కుమార్, డీఐజీ, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్


బిచ్చాట ఆడుతున్న బాలబాలికలు


క్యారమ్స్ ఆడుతూ..


ఖో ఖో ఆడుతున్న చిన్నారులు

సరదా ఆట.. పిల్లల బాట

ఒకప్పుడు సమయం దొరికితే చాలు పిల్లలు గ్రామీణ క్రీడలు ఆడుతూ కనిపించేవారు. పాఠశాలలకు సెలవైతే చాలు బాలబాలికలు కోతికొమ్మంచి, దొంగా పోలీస్ ఆట, దాగుడుమూతలు, కబడ్డీ, ఖోఖో, కర్రా బిళ్ల, గోలీలాట, చెండాట, బెచ్చాలాట, గుజ్జనగూళ్లు, అచ్చనగాయలు, చికుచికు పుల్ల, వామనగుంతలు, అష్టాచెమ్మా తదితర ఆటలు ఆడుతూ సరదాగా గడిపేవారు. ప్రస్తుతం కాలం మారింది. పిల్లల తీరూ మారింది. ఈ గ్రామీణ క్రీడలు ఆడే వారే కరువయ్యారు. ఎప్పుడూ సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, కంప్యూటర్లలో గేమ్స్ ఆడుతూ కనిపిస్తున్నారు. తల్లిదండ్రులు సైతం ఈ క్రీడల గురించి పిల్లలకు చెప్పడం గానీ, ఆడించడం గానీ లేకపోవడంతో ఆ గ్రామీణ క్రీడల గురించి ప్రస్తుత తరానికి తెలియడం లేదు. కొందరు మాత్రం పిల్లలకు తాము చిన్నప్పుడు ఆడిన ఆటలను గుర్తు చేస్తూ వారితో ఆడిస్తున్నారు. అక్కడక్కడా కొందరు పిల్లలు ఈ ఆటలు ఆడుతూ కనిపిస్తున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో కిసాన్‌నగర్‌లోని ఓ వీధిలో కొందరు పిల్లలు సంతోషంగా ఈ ఆటలు ఆడుతుండగా తీసిన చిత్రాలు.

– నెల్లూరు సిటీ

తోటల్లో అగ్ని ప్రమాదం

చేజర్ల: మండలంలోని చిత్తలూరు గ్రామం సమీపంలో తోటల్లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఆదివారం సాయంత్రం 7 గంటల సమయంలో తోటల చుట్టూ ఉన్న కంచెల్లో అగ్నిప్రమాదం జరగడంతో మంటలు ఎగిసిపడ్డాయి. స్థానిక ప్రజలు, రైతులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. పొదలకూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.


చిత్తలూరు వద్ద తోటల సమీపంలో వ్యాపించిన మంటలు

మినీ గోకులాలకు జీవం

జిల్లాలో వ్యవసాయరంగంతోపాటు పాడిపరిశ్రమ అభివృద్ధి చెందుతోంది. రైతులు ప్రస్తుతం ఆధునిక పద్ధతులు పాటిస్తూ పంటల సాగు, పాడిపరిశ్రమలపై దృష్టి సారిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు, పశుపోషకులకు అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అయితే గత టీడీపీ ప్రభుత్వం మినీ గోకులాలు, గోకులాలు నిర్మించుకుంటే బిల్లులు చెల్లిస్తామని రైతులను మోసం చేయగా ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆ బిల్లులు చెల్లించేందుకు చర్యలు చేపడుతోంది.

- బిల్లుల చెల్లింపుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు
- గతంలో నిధులు ఇవ్వకుండా కనికట్టు చేసిన టీడీపీ ప్రభుత్వం
- 90 శాతం సబ్సిడీ ఇస్తామని 10 శాతం రైతుల నుంచి వసూలు
- ఆర్థికంగా నష్టపోయిన అన్నదాతలు


సంగం మండలం మర్రిపాడులో రైతు నిర్మించిన గోకులం షెడ్(ఫైల్)

నెల్లూరు(పొగతోట): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులు నిర్మించుకున్న మినీ గోకులాలు, గోకులాలకు బిల్లుల చెల్లింపుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గత ప్రభుత్వం మినీ గోకులాలు, గోకులాల బిల్లులు చెల్లించకుండా రైతులను మోసం చేసిన నేపథ్యంలో అన్నదాతలకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మినీ గోకులాలు, గోకులాల నిర్మాణాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించి క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ సిబ్బంది, పశుసంవర్ధకశాఖ అధికారులు పరిశీలించి వివరాలను అప్‌లోడ్ చేయాల్సిఉంది.

రైతులనూ వదలని టీడీపీ ప్రభుత్వం

అందరికీ అన్నం పెట్టే రైతులను సైతం గత టీడీపీ ప్రభుత్వం మోసం చేయకుండా వదల్లేదు. మినీ గోకులాలు, గోకులాల పేరుతో వారిని మోసం చేసింది. 2018, 2019 సంవత్సరాల్లో మినీ గోకులాలు, గోకులాలు నిర్మించుకుంటే 90 శాతం సబ్సిడీ ఇస్తామని ప్రచారం చేసి 10 శాతం వాటా రైతుల చేత కట్టించింది. నిర్మాణాలు పూర్తి చేస్తే బిల్లులు చెల్లిస్తామని తెలిపింది. రైతులు 10 శాతం వాటా చెల్లించారు. అప్పులు చేసి గోకులాలు, మినీ గోకులాల నిర్మాణాలు పూర్తి చేశారు. అయితే టీడీపీ ప్రభుత్వం మాత్రం బిల్లుల చెల్లింపులో జాప్యం చేసింది. దీంతో బిల్లులు రాక రైతులు నానా అవస్థలు పడ్డారు.

అప్పట్లో ఇలా..

గత ప్రభుత్వంలో 20 పశువులు ఉండే గోకులానికి రూ.13 లక్షలు, 2, 4, 6 పశువులు ఉండే మినీ గోకులానికి రూ.90 వేలు, రూ.1.40 లక్షలు, రూ.1.70 లక్షల వ్యయంతో నిర్మాణాలు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించారు. జిల్లాకు 1,723 గోకులాలు, మినీ గోకులాలు మంజూరు చేశారు. 404 గోకులాల పనులు ప్రారంభించలేదు. 371 బేస్‌మెంట్ స్థాయిలో, 349 రూఫ్ లెవల్ వరకు నిర్మించగా, 599 గోకులాలు, మినీ గోకులాలను రైతులు పూర్తి చేశారు. అయితే గత ప్రభుత్వం ఈ నిర్మాణాలకు సంబంధించి రైతులకు బిల్లులు ఇవ్వకుండా చేతలెత్తేసింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లులు చెల్లించేలా చర్యలు చేపడుతోంది. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. పశుసంవర్ధకశాఖ అధికారులు, డ్వామా ఉద్యోగులు, సిబ్బంది ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సిఉంది. నిర్మాణాలు పూర్తయినవి, వివిధ దశాల్లో ఉన్న గోకులాలు, మినీ గోకులాలను మాత్రమే పరిశీలించి వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. వివిధ దశాల్లో ఉన్న నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. పరిశీలన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంది. వీలైనంత త్వరగా రైతులకు బిల్లులు చెల్లించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

పరిశీలన ప్రక్రియ జరుగుతోంది



జిల్లావ్యాప్తంగా 1,723 గోకులాలు, మినీ గోకులాల నిర్మాణాలకు గతంలో అనుమతులు ఇచ్చారు. పాడి రైతులు ముందుకువచ్చి గోకులాల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేశారు. బిల్లుల చెల్లింపులో గతంలో జాప్యం జరిగింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రైతుల బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టింది. క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియ జరుగుతోంది. పరిశీలించి పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతులకు బిల్లులు చెల్లించడం జరుగుతుంది.

– వెంకట్రావు, డ్వామా పీడీ

పెన్నానదిలో గల్లంతై వ్యక్తి మృతి

- చేపల కోసం వెళ్లిన ముగ్గురు పెన్నానదిలో గల్లంతు
- ఇద్దరు ఒడ్డుకు చేరగా ఒకరు మృతి

కోవూరు: మండలంలోని పడుగుపాడు ఎస్సీకాలనీ చెందిన ఆమారి మహేశ్వరరావు(35) తన ఇద్దరి స్నేహితులతో కలిసి పోతిరెడ్డిపాళెం 14 గదుల సమీపంలో పెన్నానదిలో చేపల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు జారి పడి మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకొంది. స్థానికులు, బాధితుల కథనం మేరకు ముత్తుకూరు జెన్‌కోలో కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్న ఆమారి మహేశ్వరరావు తన ఇద్దరు స్నేహితులైన మోచర్ల నరసింహారావు, కొడగలి మణితో కలిసి చేపల కోసం పెన్నానదికి వెళ్లారు. అక్కడ ముగ్గురు జాలర్లు చేపలు పడుతున్న ప్రదేశానికి సమీపంలో గట్టుపైన నిలబడి చూస్తున్నారు. అయితే వీరు నిలబడి ఉన్న గట్టు నేలకు ఒరగడంతో ముగ్గురు పెన్నానదిలో పడి గల్లంతయ్యారు. స్థానికుల సాయంతో కొడగలి మణి, మోచర్ల నరసింహారావు ఒడ్డుకు చేరారు. మహేశ్వరరావు మాత్రం కనిపించలేదు. ఒడ్డుకు చేరుకున్న మణి, నరసింహారావు ఈ విషయాన్ని మహేశ్వరరావు కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. వారు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది బోటు సాయంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు మహేశ్వరరావు కోసం గాలించారు. డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని స్టాబీడీ కాలనీలో ఉన్న జాలర్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు వల సాయంతో జాలర్లు మహేశ్వరరావు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.


మహేశ్వరరావు(ఫైల్)

చేపలు తెస్తానని చెప్పి తిరిగి రాలేదు

ఆదివారం కావడంతో మహేశ్వరరావు తను మధ్యాహ్నం డ్యూటీకి వెళ్లాల్సి ఉండగా చేపలు తెస్తానని భార్య పార్వతికి చెప్పి చేపల కోసం పెన్నానది వద్దకు వెళ్లాడు. నదిలో గల్లంతై మహేశ్వరరావు మృతిచెందడంతో భార్య పార్వతి, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్యతోపాటు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు.

క్లుప్తంగా

ప్రాణహాని ఉందని సర్పంచ్ భర్త ఫిర్యాదు

ఓజిలి: కొంతకాలంగా కొందరు వ్యక్తులు తన ఇంటి వద్దకు వచ్చి దౌర్జన్యం చేస్తూ చంపుతామని బెదిరిస్తున్నట్లు సర్పంచ్ మౌనికారెడ్డి భర్త పిండుకూరు మధుసూదన్‌రెడ్డి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితుడి కథనం మేరకు.. మండలంలోని మాచవరం ఎస్సీ కాలనీకి చెందిన కొంతమంది వ్యక్తులు శనివారం ఉదయం మధుసూదన్‌రెడ్డి ఇంటి వద్ద ఉన్న బులెట్‌ను అతను ఇంట్లో లేని సమయంలో అనుమతి లేకుండా చోరీ చేశారు. ఈ విషయాన్ని చుట్టుపక్కల వారు ఆయనకు సమాచారం అందించారు. సర్పంచ్ భర్త తన బైక్ ఎందుకు తీసుకెళ్లావని ఫోన్‌లో ప్రశ్నించగా కొత్త సినిమా రిలీజ్ ఉంది.. వెళ్లి వస్తామని చెప్పారు. తర్వాత కొంత సమయానికి బైక్ ఇంటి వద్ద పెట్టి వెళ్లిపోయారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి నెల్లూరు నుంచి ఇంటికి చేరుకుని గ్రామంలో ఏం జరిగిందో తెలుసుకున్నారు. ఎస్సీకాలనీకి చెందిన కొంతమంది మధ్యాహ్నం సర్పంచ్ భర్త ఇంట్లోకి ప్రవేశించి ఆయనపై దాడికి పాల్పడ్డారు. ఇంట్లోకి ఎందుకు వచ్చారని ప్రశ్నించగా మద్యం మత్తులో దుర్భాలాడారు. ఎందుకు తన భర్తను తిడుతున్నారని సర్పంచ్ అడ్డుకోగా ఆమెను కూడా దుర్భాషలాడి, చంపుతామని బెదిరించారు. వారితో తమకు ప్రాణహాని ఉందని, పోలీసులు రక్షణ కల్పించాలని బాధితులు కోరారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై దారం ఆదిలక్ష్మి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.


నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 139
లేయర్ (లైవ్)	: 98
బ్రాయిలర్ చికెన్	: 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 266
లేయర్ చికెన్	: 167



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.22
పండ్లు	: రూ.15



చెంగాళమ్మ ఆలయానికి ఆస్తి సమకూర్చారు


తిరునాళ్ల నిర్వహణకు నూతన మైదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి, ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి

- తిరునాళ్ల నిర్వహణకు నూతనంగా ఏర్పాట్లు చేసిన మైదానాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కిలివేటి

సూళ్లూరుపేట: పట్టణంలో వెలసిన శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయానికి ప్రత్యేకంగా సుమారు 25 ఎకరాల ఆస్తిని ఈ పాలకవర్గం సమకూర్చిందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే చెంగాళమ్మ తిరునాళ్ల కోసం శాశ్వత ప్రాతిపదికన నూతనంగా ఏర్పాటు చేసిన మైదానాన్ని స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయానికి సమీపంలోని వాటంబేడు రోడ్డులో సూళ్లూరు చెరువుకు పక్కన సుమారు 5 ఎకరాల స్థలం ఉందని గుర్తించి స్వాధీనం చేసుకున్నారని, పలువురు దాతలు కూడా స్థలం ఇవ్వడంతో ప్రస్తుతం సుమారు 20 ఎకరాలకు పైగా స్థలం ఆలయానికి ఆస్తిగా సమకూరిందని తెలిపారు. ఇందులో చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. చైర్మన్ బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఇచ్చిన సహాయ సహకారాలతోనే 25 ఎకరాలను సమకూర్చామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.రవికుమార్, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చిన్నిసత్యనారాయణ, ఆలయ పాలకమండలి సభ్యులు కర్లపూడి సురేష్‌బాబు, బండి సునీత, కౌన్సిలర్లు మీజూరు రామకృష్ణ, కదూరు లక్ష్మి, పేర్నాటి లక్ష్మీదేవి, ఉమ్మిటి రమ్య, బందిల మహేశ్వర్, పొన్నా మునిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నిజస్వరూపం బట్టబయలు


సేవా వజ్ర అవార్డు సాధించిన వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పేదల ఇళ్ల స్థలాలు గురించి అవమానకరంగా మాట్లాడుతున్న ప్రతిపక్షనేత చంద్రబాబు తన నిజస్వరూపాన్ని బట్టబయలు చేసుకున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వార్డు సచివాలయాలను ఆదివారం ఎమ్మెల్యే సందర్శించి అవార్డులకు ఎంపికైన వలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు నీఛమైన నైజాన్ని తెలుసుకున్న ప్రజలు గత ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. దగదర్తి మండలంలో టీడీపీ నాయకులు ఆరు గ్రామాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా కోర్టులో కేసులు వేసి అడ్డుకున్నారని తెలిపారు. చంద్రబాబు అధికారంలో ఉన్న 14 సంవత్సరాల కాలంలో పేదలకు సెంటు స్థలం ఇవ్వలేదని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు ఇంటి స్థలం, ఇళ్లు ఉండాలని లక్షల సంఖ్యలో వాటిని సమకూర్చుతుంటే చంద్రబాబుకు కడుపు మండిపోతుందన్నారు.

వలంటీర్ల సేవలు అద్భుతం

వలంటీర్లు సేవలు అద్భుతమని, ప్రజల ముంగిటకే ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను అమలు చేస్తుండగా, ఆ పథకాలను వలంటీర్లు ప్రజలకు చేరువ చేస్తుండడంతో వారికి ప్రజల్లో ప్రత్యేక గౌరవం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఉప్పు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, జనిగర్ల మహేంద్రయాదవ్, పొనుగోటి అనురాధ, కనుపర్తి రాజశేఖర్, కుందుర్తి శ్రీనివాసులు, కుందుర్తి కామయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరురూరల్: పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు ఆడిటోరియంలో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సి.ఆర్.రెడ్డి ఆసరా కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధి ధనుంజయరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ సి.ఆర్.రెడ్డి పేరుతో వారి కుటుంబసభ్యుల సహకారంతో ప్రతి నెలా 3వ ఆదివారం ఎంపిక చేసిన పేదవారికి నిత్యావసర సరుకులు అందజేస్తున్నామని తెలిపారు. డాక్టర్ సి.ఆర్.రెడ్డి విద్య, వైద్య రంగాల్లో అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పి.వి. కృష్ణారెడ్డి, ప్రజేంద్రరెడ్డి, కృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న సంఘం ప్రతినిధులు